సాక్షి
తిరుపతి

శనివారం । 19 । జూలై । 2025



ఆడబిడ్డకు అన్యాయంపై ఏకమయ్యారు!
అత్తింటి వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించగా స్థానిక మహిళలు అడ్డుపడి అండగా నిలిచారు. - 8లో



'ఎర్ర' స్మగ్లర్ అరెస్టు
అక్రమంగా ఎర్ర చందనాన్ని తరలిస్తున్న స్మగ్లర్‌తో పాటు దుంగలను టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. - 8లో



భర్త హత్య కేసులో భార్య అరెస్టు
పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరులో జరిగిన భర్త హత్య కేసులో భార్య, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం తిరుపతికి రానున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం తిరుపతి నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ పలువురు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శనివారం ఉదయం 10.15 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయలుదేరి 11.00 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారని, అనంతరం 11:30 గంటలకు తూకివాకం వద్ద గల ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శన, మధ్యాహ్నం 12:15 గంటలకు శ్రీ కపిలేశ్వర స్వామి వారిని దర్శించుకుని అక్కడే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర వాటా దారులతో మాట్లాడుతారన్నారు. అనంతరం మధ్యాహ్నం 01: 15 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు చేరుకొని విశ్రాంతి అనంతరం మధ్యాహ్నం 02.00 గంటల నుంచి 3.45 గంటల వరకు ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారని, సాయంత్రం 04.00 గంటలకు శ్రీకంచి కామకోటి పీఠంకు చేరుకుని కంచి ఆచార్యులను కలవనున్నారు. సాయంత్రం 04.30 గంటలకు కంచి కామకోటి పీఠం నుంచి బయలుదేరి 05.00 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకొని విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారని ఆయన వివరించారు.

నర్సింగ్ అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా : స్విమ్స్‌లో నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీమ్ కింద 100 మంది నర్సింగ్ విద్యార్థులకు అప్రెంటిస్ శిక్షణ ఇస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఏదేని రాష్ట్రం నుంచి నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ పొంది ఉండాలన్నారు. అలాగే హిందూ మతానికి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. అప్రెంటిస్ ఎంపికకు రిజర్వేషన్ల ప్రాతిపదికన నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రధానంగా ఓసీ 45, బీసీఏ 7, బీసీబీ 10, బీసీడీ 7, ఎస్సీ 15, ఎస్టీ 6, ఈడబ్ల్యూఎస్ 10 కేటాయించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుల కోసం అభ్యర్థులు ఆసుపత్రి రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 18న నిర్వహిస్తామని, 19న మెరిట్ జాబితా విడుదల చేసి 20వ తేదీన ఇంటర్వ్యూలు చేపడతామని తెలిపారు.

హిందీ పండిట్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు : జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో (సత్యవేడు) ఖాళీగా ఉన్న హిందీ పండిట్ పోస్టు భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు స్థానిక ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. గెస్టు ఫ్యాకల్టీ ప్రాతిపదికన డెమో నిర్వహించి హిందీ పండిట్ పోస్టును భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు హిందీ పండిట్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని గురుకుల బాలికల పాఠశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ కామేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ ఇంగ్లీషు, టీజీటీ పీఈటీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 22వ తేదీ లోపు పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులకు అర్జీ రూపంలో వివరాలు సమర్పించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ తోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 63,897 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది.

పారిశ్రామికం.. ఆర్భాటం

పారిశ్రామిక వాడలు అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పించాలనే ఆశయం ఆదిలోనే నీరుగారిపోతోంది. కూటమి ప్రభుత్వం కేవలం ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించడం మినహా ఇప్పటి వరకు స్థల సేకరణలోనే కాలం వెల్లదీస్తున్నారు. ఎంపిక చేసిన ఆరుచోట్ల పారిశ్రామిక పార్కుల ప్రగతి ముందుకు సాగడం లేదు. క్షేత్రస్థాయిలో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. కేటాయించిన స్థలాలు అభివృద్ధి చేయకుండానే పరిశ్రమలు వస్తాయని ఊరించడం యువతను మభ్యపెట్టేందుకేనని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.



- స్థల సేకరణే తప్ప నిధుల కేటాయింపు శూన్యం
- కొన్నిచోట్ల ఆక్రమణలలో ప్రభుత్వ స్థలాలు
- పరిశ్రమలకు చెందిన పార్కులు వస్తున్నాయని ప్రకటనలు
- మౌలిక వసతులు కల్పించకుండానే అధికారుల హడావుడి

చిల్లకూరు : యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లాలో ఆరుచోట్ల ఎంఎస్ఎంఈ(మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజస్) కింద పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు స్థలాలను (పార్కులు) ఇస్తామని ఆర్భాటంగా కూటమి ప్రభుత్వం ప్రకటనలు చేయడమే కానీ వాటికి పూర్తి స్థాయి మార్గ దర్శకాలు లేకుండా చేయడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమ మార్కు రాజకీయంతో యువతను తమ వైపు తిప్పుకునేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సాహకాలు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించారు. అందుకు సంబంధించి పార్కులు ఏర్పాటు చేసి అక్కడ చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు చేసుకొని తమతో పాటుగా మరికొంత మందికి ఉపాధి కల్పించవచ్చని ఊరించడం, అటు తరువాత మిన్న కుండి పోవడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లాలో ఆరు నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు సిద్ధం అయ్యారు. దీంతో ఆయా ప్రాంతాలలోని రెవెన్యూ అధికారులను ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో వాటిని ఏపీ ఐఐసీకి అప్పగించేలా ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పారిశ్రామికంగా జిల్లా ముందడుగు వేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ప్రకటనలు గుప్పించేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో మరోలా ...

ఏపీఐఐసీ భూ సేకరణ చేపట్టినప్పటికీ ఇక్కడ రెండు (తిరుపతి, నెల్లూరు) జిల్లాలకు చెందిన అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో మూడు నియోజకవర్గాలకు ఒక అధికారి, మరో మూడు నియోజకవర్గాలు మరో అధికారి పర్యవేక్షణలో ఉండడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉన్న సమయంలో చిల్లకూరు మండలం నక్కల కాలువ కండ్రిగలో సుమారు 85 ఎకరాల భూములను ఏపీ ఐఐసీ స్వాధీనం చేసుకుంది. అయితే ఇక్కడ భూముల్లో ఏటా వర్షాలు కురిసిన సమయంలో నెలబల్లిరెట్టపల్లికి చెందిన దళితులు ఆ భూముల్లో వరి సాగు చేసుకుంటూ ఈ భూములను ఎన్నో ఏళ్లుగా తమ అధీనంలో ఉండగా పరిశ్రమలకు ఎలా కేటాయిస్తారని అడ్డుపడుతున్నారు. దీంతో అక్కడ భూములపై వివాదం నెలకొని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో కేటాయించిన భూముల్లో కూడా బాలాయపల్లి మండలంలోని మన్నూరులో ఎక్కడా ప్రభుత్వ భూముల లేక అటవీ భూములను పరిశీలించి అధికారులు నివేదికలను పంపారు. అటవీ భూములను పరిశ్రమలకు ఎలా కేటాయిస్తారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

భూ కేటాంపులు ఇలా ..

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలోని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాచగున్నేరిలో 14 ఎకరాలు, వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలం మన్నూరులో 60 ఎకరాలు, గూడూరు నియోజకవర్గం గూడూరు మండలం కొమ్మనేటూరులో 40 ఎకరాలు, సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం శిరసనంబేడు వద్ద 100 ఎకరాలు, చంద్రగిరి నియోజకవర్గం చంద్రగిరిలో 65.29 ఎకరాల భూములను కేటాయించారు.

జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కులకు స్థలాలు కేటాయించిన ప్రాంతాలు

నియోజకవర్గం	మండలం	ప్రాంతం
గూడూరు	గూడూరు	కొమ్మనేటూరు
వెంకటగిరి	బాలాయపల్లి	మన్నూరు
సూళ్లూరుపేట	పెళ్ళకూరు	శిరసనంబేడు
సత్యవేడు	వరదయ్యపాళెం	చినపాండూరు
శ్రీకాళహస్తి	శ్రీకాళహస్తి	రాచగున్నేరి
చంద్రగిరి	చంద్రగిరి	చంద్రగిరి

మౌలిక వసతుల కల్పనకు నిధులు లేక

ఎంఎస్ఎంఈ (మైక్రోస్మాల్ మీడియం ఎంటర్ ప్రైజస్) కింద భూములను యువ పారిశ్రామిక వేత్తలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. అయితే ఇక్కడ భూ సేకరణను రెవెన్యూ అధికారులకు అప్పగించి వారి నుంచి ఏపీ ఐఐసీ స్వాధీనం చేసుకునేలా ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆగమేఘాల మీద రెవెన్యూ అధికారులు భూ సేకరణ చేపట్టారు. అయితే పలు చోట్ల భూములను అప్పగించినప్పటికీ ఒక్క మన్నూరు గ్రామంలో మాత్రం ప్రభుత్వ భూమి లేక అటవీ భూమిని గుర్తించి జిల్లా అధికారులకు స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి నివేదికలను పంపారు. మిగిలిన ఐదు చోట్లలో ఒక్క శ్రీకాళహస్తిలో మాత్రం నిధుల కేటాయింపు జరిగి మౌలిక వసతులు చేపడుతున్నారు. మిగిలిన నాలుగు ప్రాంతాలలో భూ కేటాయింపులను చేపట్టినప్పటికీ ఆయా ప్రాంతాలలో ఎక్కువగా చెట్లు, పుట్టలు పెరిగిపోయి ఉన్నాయి. వీటిని చదును చేసి అక్కడ రోడ్లు, నీటి వసతి కల్పిస్తే పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తారు. కానీ అక్కడ కనీస మౌలిక వసతులకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయింపు చేయకనే పారిశ్రామిక వాడలకు భూములు కేటాయించామని గొప్పలు చెప్పుకుంటూ ముందుకు వెళుతున్నారు.



గూడూరు : కొమ్మనేటూరు ప్రాంతంలో ఎంఎస్ఎంఈ కోసం సేకరించిన భూమిలో పెరిగిన చెట్లు, పుట్టలు



వెంకటగిరి: మన్నూరులో ప్రభుత్వ భూములు లేకపోవడంతో అటవీ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

శ్రీకాళహస్తిలో పనులు మొదలు పెట్టాం

"ఎంఎస్ఎంఈ పార్కులకు సంబంధించి భూ సేకరణ పూర్తి కావస్తోంది. ప్రస్తుతం శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రాచగున్నేరి ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్కు కోసం మౌలిక వసతుల పనులను వేగంగా చేసేలా చర్యలు చేపడుతున్నాం. పనులు పూర్తి చేసిన తరువాత పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి స్థలాలు కేటాయించడం జరుగుతుంది. జిల్లాలోని వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు చెందిన పార్కులను నెల్లూరు జోనల్ మేనేజర్ పర్యవేక్షిస్తారు.

– విజయభరత్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, తిరుపతి

ఊసేలేని పీజీసెట్, ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

తిరుపతి సిటీ : ఏపీ పీజీసెట్, ఏపీ ఎడ్‌సెట్–2025 ఫలితాలు విడుదలై దాదాపు నెల రోజులు గడుస్తున్నా ఉన్నత విద్యా మండలి కౌన్సెలింగ్ ప్రక్రియపై దృష్టి సారించక పోవడంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్వీయూ పరిధిలో ఏపీ పీజీ సెట్‌లో సుమారు 6 వేల మంది విద్యార్థులు అర్హత సాధించి అడ్మిషన్ల ప్రక్రియ కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే ఎడ్‌సెట్ పరీక్షలో 3 వేల మంది విద్యార్థులు అర్హత సాధించి బీఈడీ అడ్మిషన్ల కోసం నిరీక్షిస్తున్నారు.

నేడు వెబ్ ఆప్షన్ల మార్పులకు అవకాశం

తిరుపతి సిటీ : ఏపీఈఏఎమ్‌సెట్–2025కు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈనెల 13 నుంచి కొనసాగిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. దీంతో శనివారం ఒక రోజు మాత్రమే ఆప్షన్ల మార్పునకు అవకాశం ఇచ్చారు. 22వ తేదీన సీట్ల కేటాయింపు చేయనున్నారు.

కూటమి మోసాలపై నిలదీద్దాం



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న జిలా అధ్యక్షుడు భూమన , ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ క్యూఆర్‌కోడ్ ఆవిష్కరణ
- ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన

శ్రీకాళహస్తి : చంద్రబాబు, పవన్ ప్రమాణం చేసిన మోసపూరిత వాగ్దానాలను అందరం సమష్టిగా ప్రజల్లోకి తీసుకెళ్లి వారి మోసాలను ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని మధు కన్వెన్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నియోజవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భూమన కరుణాకరరెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల ముందు టీడీపీ నేతలు ప్రతి ఇంటికి వెళ్లి హామీలతో ప్రమాణ పత్రాలను ఇచ్చి ప్రజలను వంచించారన్నారు. గెలిచి ఏడాదవుతున్నా 90 వేల కోట్లకుపైగా అప్పులు చేశారనీ, ప్రజలకు ఇస్తానన్న హామీలు మాత్రం నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. కనీసం తల్లికి వందనం 80 లక్షల మందికి ఇవ్వాల్సి ఉండగా 50 లక్షల మందికి ఇచ్చి 30 లక్షల మందికి ద్రోహం చేశారన్నారు. ప్రతి ఆడబిడ్డకు రూ.1,500 ఇస్తానని బాండు ఇచ్చి నేడు వారిని వంచించారన్నారు. కూటమి మోసాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు కలిసికట్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ క్యూర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వారు ఇచ్చిన హామీలు, చేస్తున్న మోసాలకు సంబంధించి వీడియోలు ఉన్నాయని, వారు ఇచ్చిన సూపర్‌సిక్స్ 143 హామీలు ఏమయ్యాయో ప్రజలు వారిని నిలదీయాలన్నారు. శ్రీకాళహస్తిలో దుర్మార్గమైన పరిస్థితులు ఉన్నాయని ఎంతో మంది నియంతలు కాలగర్భంలో కలిసిపోయారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని ప్లెక్సీలో కూడా చూడడానికి ఇక్కడి నాయకులకు భయమేస్తోందంటే ఇక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతోందన్నారు. ప్లెక్సీలను తొలగించడం సరైన సంప్రదాయం కాదన్నారు.

మోసాలను ఇంటింటికీ తీసుకెళ్దాం

ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. వారు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గతంలో జగన్ సంక్షేమ పాలనను ప్రజలకు తెలియజేయాలన్నారు.

కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గిరిధర్‌రెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి, ఉన్నం వాసుదేవనాయుడు, కోగిలి సుబ్రహ్మణ్యం, మధుసూదన్‌రెడ్డి, రమణయ్యయాదవ్, సుధాకర్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రయ్యనాయుడు, హరిప్రసాద్‌రెడ్డి, సిరాజ్‌బాషా, పఠాన్ ఫరీద్, శ్రీవారిసురేష్, కంఠా ఉదయ్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో అరాచక పాలన

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అరాచక పాలన నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపేడులో 40 మంది ఎస్టీలు, తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ గ్రామంలో 20 ఇళ్లు ఊర్లు వదలి వలసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అరాచక పాలన తాము చేయలేదన్నారు. వెయ్యికి పైగా ఇల్లు పునాదులు ధ్వంసం చేశారని, గతంలో శ్రీకాళహస్తిలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ప్రస్తుత ఎమ్మెల్యే అరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఆడబిడ్డకు అన్యాయం జరిగింది.. ఎక్కడ పవన్?

'మా ఆడబిడ్డ వినుతపై దాడి చేస్తారా నా కొ..ల్లారా' అని ఆ నాడు గొంతెత్తిన పవన్ కల్యాణ్ నేడు జన సైనికుడిని చంపిన కేసులో ఆమె ముద్దాయిగా జైలులో ఉంది.. దారుణంగా హత్యకు గురైన రాయుడు చెల్లి ఎక్కడున్నావ్ పవన్... ఇదంతా నీకు కనపడలేదా.. రాయుడు కుటుంబాన్ని ఎందుకు ఆదుకోలేదు' అని ప్రశ్నిస్తుంటే ఎందుకు స్పందదలేదని భూమన నిలదీశారు. తిరుపతిలో మీ నాయకుడు ఓ మహిళను ఇబ్బందులకు గురిచేస్తే దానిపై మాట్లాడవు.. మీ పార్టీకి చెందిన ఓ డ్యాన్సర్ ఓ మైనర్‌కు అన్యాయం చేస్తే మాట్లాడలేదేమని ప్రశ్నించారు. తిరుపతికి వచ్చి నేను సనాతవాదిని అని గద్దించి ఇంటికి వెళ్లి పడుకున్నావా అని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు కష్టం వస్తే ఎగసేకుని వచ్చి మాట్లాడుతావు గానీ.. నీ కార్యకర్తలకు కష్టం వస్తే మాట్లాడకపోవడం బాధాకరమన్నారు.

రేపు ఐఐటీ 7వ స్నాతకోత్సవం



ఏర్పేడు : 'వారంతా ఏళ్ల తరబడి జాతీయ విద్యాసంస్థ ఐఐటీ ఒడిలో సాంకేతిక విద్యను అభ్యసించారు. తమ భావి జీవితానికి గట్టి పునాదిని ఇక్కడే నిర్మించుకున్నారు. అత్యుత్తమ మార్కులతో తాము ఎంచుకున్న కోర్సులో ఉత్తీర్ణులైన వారికి జరగబోయే 'పట్టా'భిషేక వేడుకలో డిగ్రీ పట్టాలను అందుకోనున్నారు. ఈ వేడుక 418 భావి ఇంజినీర్లలో కొత్త కాంతులను తీసుకురానుంది. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ (భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ) ప్రాంగణంలో ఆదివారం 7వ స్నాతకోత్సవ వేడుక జరగనుంది.

వేడుక వివరాలు

- వేడుకలో పట్టాలు పొందనున్న విద్యార్థులు 418
- అవార్డులు అందుకోనున్న విద్యార్థులు 18
- ప్రెసిడెంట్ మెడల్ విజేత – అరవింద్ శ్రీనివాసన్ (సీఎస్ఈ)
- గవర్నర్ మెడల్ విజేత – ఎం.మేఘవర్షిణి (కెమికల్ ఇంజినీరింగ్)

ముఖ్య అతిథులు :

- క్రియా యూనివర్సిటీ చాన్సలర్, కాగ్నిజెంట్ కో ఫౌండర్ లక్ష్మీనారాయణన్
- జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్
- సభాధ్యక్షులు – డాక్టర్ కలిదిండి సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ, తిరుపతి

ఎందుకంత భయం?



తొలగిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతల ఫ్లెక్సీ



అధికారులకు కనబడని కూటమి నేతల ఫ్లెక్సీ

- శ్రీకాళహస్తిలో కూటమి కుట్రలు
- వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను తొలగించిన వైనం
- మున్సిపల్ అధికారులను ఉసిగొల్పిన ఎమ్మెల్యే
- కూటమి ఫ్లెక్సీలు, కటౌట్‌లను ముట్టుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఈసారి వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలపై తన ప్రతాపం చూపించారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లకు అనుమతి లేవంటూ మున్సిపల్ అధికారుల చేత తొలగించారు. అవే ఫ్లెక్సీల పక్కనే ఉన్న కూటమి నేతల కటౌట్‌లు, ఫ్లెక్సీల జోలికి మాత్రం వెళ్లలేదు. కూటమి ఏడాది పాలనా వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం శ్రీకాళహస్తిలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తిలో కూటమి పార్టీపై జనంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఎమ్మెల్యే భయపెట్టే ప్రయత్నం చేశారు. మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి పట్టణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను తొలగించారు. అయితే పక్కనే కూటమి ఫ్లెక్సీలు ఉన్నా వాటి జోలికి వెళ్లకుండా వైఎస్సార్‌సీపీకి చెందిన వాటినే తొలగించడంపై స్థానికులు మండిపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను తొలగించటాన్ని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే తొత్తులుగా వ్యవహరించొద్దని హెచ్చరించారు.

క్లుప్తంగా

హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో కాంపాళెం యువకుడి మృతి


నరసింహులు (ఫైల్)

బుచ్చినాయుడుకండ్రిగ : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంపాళెం గ్రామానికి చెందిన యువకుడు దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాంపాళెం గ్రామ దళితవాడకు చెందిన గంధం మల్లెమ్మ కుమారుడు గంధం నరసింహులు (28) ఏడాది కాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి డ్యూటీకి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బస్సు ఢీకొంది. దీంతో నరసింహులుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరసింహులు మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి లేని నరసింహులుపై ఆధారపడి తల్లి, సోదరి జీవనం సాగిస్తున్నారు. మృతదేహం కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత


బాలికను తండ్రికి అప్పగిస్తున్న ఎస్‌ఐ కోటయ్య

కలువాయి(సైదాపురం) : మతిస్థిమితం లేక తప్పిపోయిన ఓ బాలికను కలువాయి పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కలువాయికి చెందిన మోడిబోయిన చంద్రకు పెళ్లి అయి ఒక పాప ఉంది. మతిస్థిమితం సరిగ్గాలేని పాప ఈనెల 16వ తేదీన రైలు ఎక్కి తిరుపతికి వెళ్లిపోయింది. రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు పట్టుకొని విచారించి కలువాయి ఎస్‌ఐ కోటయ్యకు సమాచారం అందించారు. స్పందించి ఎస్‌ఐ వారి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఆ బాలికను ఆమె తండ్రికి అప్పగించారు.

బడికి పంపకుండా నిరసన


విద్యార్థులు లేక బడిలో ఖాళీగా డెస్కులు

తడ : మా బడి.. మాకే కావాలంటూ తడ హరిజనవాడకు చెందిన తల్లిదండ్రులు చేస్తున్న నిరసన అయిదు రోజులుగా సాగుతోంది. ఈనెల 14వ తేదీ నుంచి తమ పిల్లలను బడికి మాన్పించి ఇళ్లకే పరిమితం చేసి 5 రోజులు గడిచినా అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బడుల విలీన ప్రక్రియలో భాగంగా తడ హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 46 మంది విద్యార్థుల్లో 28 మందిని తడకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అప్పటి నుంచి పలుసార్లు అధికారులకు గ్రామస్తులు వినతి పత్రాలు అందించారు. సరైన స్పందన లేకపోవడంతో నిరసనలకు దిగారు.

బాబు గారూ.. ఇదీ చంద్రగిరీ.. !

- బడగనపల్లెలో దారికి అడ్డంగా కూటమి నేతల ఇనుప కంచె
- మూడు రోజులుగా ఇంటి నుంచి బయటకు రాలేని కుటుంబం
- అటవీ సమీప గ్రామంలో రాత్రివేళ బిక్కుబిక్కుమంటూ జీవనం


వెంకటరమణ ఇంటికి దారిలేకుండా వేసిన ఇనుక కంచె


వెంకటరమణ ఇంటి వద్ద రాత్రిపూట పరిస్థితి ఇదీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: చంద్రబాబు గారూ.. మీ స్వగ్రామం నారావారిపల్లె ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో కూటమి నేతలు రాజకీయ ప్రతీకారాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రశాంతమైన పల్లెలకు రక్తపు మరకలు అంటిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో వేసిన దారులను మూసివేస్తున్నారు. గృహ నిర్బంధాలకు పాల్పడుతున్నారు. అప్పటికీ మాట వినకుంటే భౌతికంగా దాడులు చేస్తున్నారు.. కూటమి నేతల దాష్టీకానికి నిలువెత్తు నిదర్శనమే గత మూడు రోజుల క్రితం జరిగిన బడగనపల్లి ఘటన. ఎర్రావారిపాళెం మండలం కమలయ్యగారి పల్లె పంచాయతీ పరిధిలోని బడగనపల్లెకు చెందిన వెంకటరమణ కుటుంబంపై అదే గ్రామానికి చెందిన జనసేన సానుభూతిపరులు కక్షగట్టారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడుగా ఉన్న వెంకటరమణ ఇంటికి వెళ్లే దారిని ఇనుప కంచెతో మూసివేశారు. అది కూడా పంచాయతీ నిధులతో నిర్మించిన సిమెంటు దారి. మూడు రోజులుగా ఇంటి నుంచి బయటకు వెళ్లలేక నరకం చూస్తున్న వెంకటరమణ కుటుంబీకుల గోడు స్థానిక అధికారులు ఎవరికీ పట్టడం లేదు. బడగనపల్లె అసలే అటవీ ప్రాంతానికి సమీపాన ఉన్న గ్రామం.. అందులో వెంకటరమణ నివసించే ఇల్లు పొలాల్లో ఉంది. ఆ పల్లెకు సమీప ప్రాంతంలోని పొలాల్లోనే ఏనుగులు సంచరిస్తున్నాయి. ఇటీవల చిట్టిచెర్లలో ఓ రైతును తొక్కి చంపేశాయి. ఈ పరిస్థితుల్లో ఆ కుటుంబం ఇంటి నుంచి వెలుపలకు రాలేక నరకం అనుభవిస్తోంది. ఇదేనా కూటమి ప్రభుత్వం మంచి పాలన? ఇదేనా మీరు చేస్తున్న మంచి? అంటూ ఆ కుటుంబం ప్రశ్నిస్తోంది. ముఖ్యమంత్రి హోదాలో తిరుపతి వస్తున్న మీరైనా ఆ కుటుంబం గోడు పట్టించుకుని న్యాయం చేస్తారని ఆకాంక్షిస్తోంది.

మైనింగ్ లీజు వ్యవహారంపై సర్వే


సర్వే చేస్తున్న అధికారులు

సైదాపురం : మండల కేంద్రమైన సైదాపురంలోని మైనింగ్ లీజు భూముల వ్యవహారంపై శుక్రవారం తహసీల్దార్ సుభద్ర, ఉద్యానశాఖాధికారి ఆనంద్, అటవీ అధికారి శ్రీనివాసులు సంయుక్తంగా సర్వే చేశారు. సైదాపురంలోని 793 సర్వే నంబర్‌లో సుమారు 114 ఎకరాల 71 సెంట్ల భూమి ఉంది. ఆ భూమి కొండ పోరంబోకుగా రెవెన్యూ రికార్డులో ఉంది. గతంలో ఆ భూమిలో మైనింగ్ లీజు ఉండేది. కాలక్రమేణా ఆ లీజు గడువు ముగిసింది. దీంతో సుమారు 21 మందికి పైగా పేదలు ఆ ప్రాంతంలో నిమ్మ, మామిడి చెట్లు వేసుకుని పంటలను సాగు చేస్తున్నారు. సుమారుగా 40 ఎకరాల భూమిని వారు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో మళ్లీ ఆ గనికి లీజు పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఆ రైతులకు స్థానిక రెవెన్యూ అధికారులు ఇటీవల నోటీసులు అందించారు. దీంతో ఆ భూములను సమగ్ర సర్వే చేసేందుకు ప్రభుత్వం జాయింట్ సర్వే బృందంను ఏర్పాటు చేసింది. సర్వేలో భాగంగా సాగులో ఉన్న నిమ్మ, మామిడి చెట్లను అధికారులు పరిశీలించారు. ఈ విషయమై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు.

భర్త హత్య కేసులో భార్య అరెస్టు

రాపూరు : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరులో గురువారం జరిగిన భర్త హత్య కేసులో భార్య, ప్రియుడిని అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాపూరు అరుందతీయవాడకు చెందిన లేబాకు శీనయ్య(28)కు పంగిలి గ్రామానికి చెందిన ధనమ్మతో 2022లో వివాహం అయ్యిందని అప్పటికే ధనమ్మకు అదే గ్రామానికి చెందిన కల్యాణ్ అలియాస్ వెంకటరమణయ్యతో వివాహేతర సంబంధం ఉండేదన్నారు. పెళ్లి అయినా కూడా ఆ సంబంధం కొనసాగుతుండేదన్నారు. శీనయ్య అడ్డుగా ఉండంతో అతడిని అడ్డు తొలగించుకునేందుకు పథకం వేసుకున్నారన్నారు. శీనయ్య కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడని మద్యం అలవాటు ఉండేదని దీనిపై తరుచూ గొడవలు జరుగుతుండేవన్నారు. బుధవారం రాత్రి శీనయ్య మద్యం తాగి నిద్రిస్తుండగా ధనమ్మ తన ప్రియుడు కల్యాణ్‌కు ఫోన్ చేసి రమ్మని పిలవడంతో కల్యాణ్ మంచంపై నిద్రిస్తున్న శీనయ్య చేతులు, కాళ్లు కట్టివేసి మెడపై ఆటోగేర్ వైరుతో ఊపిరాడకుండా చంపేశారన్నారు. శీనయ్య మరణాన్ని సహజ మరణంగా సృష్టించేందుకు గురువారం భార్య ధనమ్మ శీనయ్య తల్లిదండ్రులకు మద్యం తాగి తలుపునకు కొట్టుకుని పడి ఉన్నాడని నమ్మ బలికేందుకు ప్రయత్నించిందన్నారు. శీనయ్య చెవి నుంచి రక్తం కారడంతో శీనయ్య తల్లి రమణమ్మ అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు ప్రారంభించామని , భార్య ధనమ్మ,ప్రియుడు కల్యాణ్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఎస్‌ఐ వెంకటరాజేష్, కండలేరు డ్యామ్ ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

కొడుకు చేతిలో తల్లి హతం

- తిరుపతిలో విషాదం

తిరుపతి క్రైం : తల్లి ఓ వ్యక్తితో సన్నిహితంగా ఉండడాన్ని జీర్ణించుకోలేక తిరుపతిలో ఓ యువకుడు తల్లిని హతమార్చిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రొంపిచర్ల మండలానికి చెందిన ఓ మహిళ (37)కు చిన్నగొట్టిగల్లుకు చెందిన వ్యక్తితో వివాహం అయింది. ఆమె భర్త ప్రస్తుతం ఉపాధి కోసం కువైట్‌లో ఉంటున్నాడు. భార్య తన ఇద్దరు కుమారులతో కలిసి తిరుపతి ఆటోనగర్‌లోని పూలవానిగుంటలో నివాసం ఉంటోంది. ఓ షోరూంలో సేల్స్ ఉమన్‌గా ఆమె పనిచేస్తోంది. పెద్ద కుమారుడు పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం చదువు నిలిపేసి ఇంటి వద్దనే ఉన్నాడు. రెండో కుమారుడు ఇటీవల ఇంటర్ పూర్తిచేసుకుని ప్రస్తుతం డిగ్రీలో చేరాడు. అయితే ఆ మహిళ ఓ వ్యక్తితో సన్నిహితంగా ఉండడాన్ని పెద్ద కుమారుడు గమనించాడు. దీంతో కోపం ఆపుకోలేక గురువారం అర్ధరాత్రి తల్లిపై దాడిచేసి గొంతు నులిమి హత్య చేశాడు. తల్లి మృతి చెందిన అనంతరం శుక్రవారం వేకువజామున నాలుగు గంటల సమయంలో వారి తాతకు, అమ్మమ్మకు ఫోన్‌చేసి విషయం తెలియజేశాడు. హుటాహుటిన వారు తిరుపతికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు.

హాస్టళ్లలో అడ్మిషన్లకు అవకాశం

- మరో 1616 సీట్లు ఖాళీలు
- ఆగస్టు 5వ తేదీ వరకు గడువు


విక్రమ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టల్స్ (ఎస్సీ హాస్టల్స్)లో విద్యార్థులను చేర్చుకోవడానికి వచ్చేనెల 5 వరకు అవకాశం ఉందని ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తమ కార్యాలయం నుంచి మాట్లాడుతూ.. జిల్లాలో 60 ఎస్సీ హాస్టల్స్ ఉన్నాయని చెప్పారు. వీటిలో 5 నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులను చేర్చుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. అయితే 6600 మందిని చేర్చుకోవడానికి వీలుందని వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు పాత విద్యార్థులు 3640 మంది, కొత్త విద్యార్థులు 1344 మంది చేరారని చెప్పారు. మొత్తంగా 4984 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని వివరించారు. మరో 1616 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్థులకు అనుకూలంగా ఉన్న హాస్టల్స్‌లో చేరడానికి వీలుందని స్పష్టం చేశారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరోవైపు హాస్టల్స్ మరమ్మతులు, అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం జిల్లాలోని ఎస్సీ హాస్టల్స్‌కు రూ.8 కోట్లు, జిల్లా కలెక్టర్ నిధి నుంచి మంజూరు చేశారని చెప్పారు.

నేడు బీఎస్‌ఐ కాన్‌క్లేవ్.. 2.0


మాట్లాడుతున్న బీఎస్‌ఐ సంస్థ చైర్మన్ సందీప్

తిరుపతి కల్చరల్ : వ్యాపార రంగంలో వ్యాపార సంబంధాల అభివృద్ధిపై వ్యాపారవేత్తలకు కరకంబాడి రోడ్డులోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బీఎస్‌ఐ కాన్‌క్లేవ్..2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీఎస్‌ఐ సంస్థ చైర్మన్ మణి సందీప్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా సుమారు 1500 మందికిపైగా ప్రముఖ వ్యాపార వేత్తలు , పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనుభవజ్ఞులైన వ్యాపార, పారిశ్రామిక వేత్తలచే బిజినెస్ స్పీచ్, నెట్‌వర్కింగ్, ప్రొడక్ట్ షోకేస్‌లు, స్పెషల్ ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలందరూ పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో బీఎస్‌ఐ ఈడీ సంతోష్, ప్రతినిధులు దుర్గా ప్రసాద్, వంశీకృష్ణ, స్వాతి పాల్గొన్నారు.

ముగిసిన ఉపగ్రహ తయారీ వర్క్‌షాప్


సర్టిఫికెట్లతో విద్యార్థులు, నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో రెండు రోజులుగా నిర్వహించిన ఉపగ్రహ తయారీ వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా చెన్నైకి చెందిన స్పేస్ కిడ్జ్ ఇండియా సహకారంతో విద్యార్థులకు ఈ వర్క్‌షాపును నిర్వహించారు. దీనికి వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌ను ఉద్దేశించి రీజనల్ సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.శ్రీనివాస నెహ్రూ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి వారిని భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వివిధ సంస్థల భాగస్వామ్యం, సహకారంతో సైన్స్ సెంటర్ వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అంతరిక్ష వారోత్సవాల నేపథ్యంలో ఉపగ్రహాలు ఎలా పనిచేస్తాయి, వాటిలోని రకాలు, వాటి పనితీరు, కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించడంతో పాటు వారితో ఉపగ్రహాల తయారీపై వర్క్‌షాపును నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం ఈ వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో సైన్స్ సెంటర్ సిబ్బంది, స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఎర్ర’ స్మగ్లర్ అరెస్ట్

తిరుపతి మంగళం : అక్రమంగా ఎర్ర చందనాన్ని తరలిస్తున్న స్మగ్లర్‌తో పాటు ఎర్ర చందనాన్ని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. డీఎస్పీ బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఐ నరేష్ టీమ్ స్థానిక ఎఫ్‌బీఓ అనిల్ కుమార్‌తో కలిసి కడప జిల్లా సానిపాయ సమీపంలోని వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా అయ్యలవారిపల్లి వద్ద ఒక వ్యక్తి మోటారు సైకిల్ వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అయితే టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతన్ని పట్టుకుని, అతని వద్ద నుంచి మూడు ఎర్ర చందనం దుంగలు , మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. అతడిని తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులతో సహా ఎర్రచందనం స్వాధీనం

వరదయ్యపాళెం : తమిళనాడుకు తరలిస్తున్న ఎర్ర చందనం వాహనంతో సహా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి నుంచి తడ వైపుగా వెళ్తున్న ఓ మినీ వాహనంలో సుమారు 10 ఎర్ర చందనం దుంగలను తమిళనాడుకు తరలిస్తుండగా స్థానిక పోలీసులకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు వరదయ్యపాళెంలో నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు ఎర్రచందనంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. అయితే పూర్తిస్థాయి వివరాలను విచారణ అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థులు క్షేమం


విద్యార్థులను అప్పగిస్తున్న ఎస్‌ఐ అనిత

చంద్రగిరి : చెప్పా పెట్టకుండా హాస్టల్ నుంచి పారిపోయిన విద్యార్థులను 24 గంటల్లో చంద్రగిరి పోలీసులు గుర్తించారు. వారిని క్షేమంగా తీసుకొచ్చి శుక్రవారం చంద్రగిరిలో తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రభుత్వ బీసీ హాస్టల్ నుంచి తిరుపతికి చెందిన శ్యామ్ నాగరాజ్, పీలేరుకు చెందిన గోపిచంద్ 9వ తరగతి చదువుతున్నారు. గురువారం తెల్లవారుజామున వారిద్దరూ ఎవరికీ చెప్పకుండా హాస్టల్ నుంచి వెళ్లిపోయారు. దీంతో వార్డెన్ వనజ విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ అనిత విద్యార్థుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం చిత్తూరు జిల్లా సదుంలో విద్యార్థులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సదుంకు చేరుకున్న చంద్రగిరి పోలీసులు శ్యామ్ నాగరాజ్‌తో పాటు గోపిచంద్‌ను క్షేమంగా చంద్రగిరికి తీసుకొచ్చారు. పాఠశాలకు సక్రమంగా వెళ్లకపోవడంతో మందలించారని, హాస్టల్ నుంచి ఇంటికి పంపిచేస్తామని బెదిరించడంతో పారిపోయినట్లు విద్యార్థులు తెలిపారు. అనంతరం ఎస్‌ఐ అనిత.. విద్యార్థులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

రాక్షస పాలన నుంచి మహిళలను కాపాడు తల్లీ !


మేయర్ శిరీషతో పాటు పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

తిరుపతి మంగళం : కూటమి రాక్షస పాలన నుంచి మహిళలకు రక్షణ కల్పించి కాపాడు గంగమ్మ తల్లీ అంటూ తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీషతో పాటు వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు వేడుకున్నారు. మాజీ మంత్రి ఆర్‌కె.రోజాపై నగిరి ఎమ్మెల్యే గాలిభానుప్రకాష్ నాయుడు మహిళలను కించపరుస్తూ చేస్తూ వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ఎర్ర దుస్తులు ధరించి చేతుల్లో హారతులు పట్టుకుని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ.. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు భద్రత కల్పిస్తాం, మహిళల జోలికి ఎవ్వరైనా వస్తే తాట తీస్తామని గొప్పలు చెప్పిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు కీచకుల్లా మహిళలను కించపరిచి మాట్లాడడం, హేళన చేయడం, దాడులు చేయడం వంటివి కనిపించడంలేదా? అని ప్రశ్నించారు. ఆర్‌కె. రోజాపై గాలి మాటలు మాట్లాడడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వానికి మహిళలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాళ్లు మునీశ్వరి, మునిరత్నమ్మ, పార్టీ నగర బూత్‌కమిటీ అధ్యక్షురాలు ముప్పాల సాయికుమారి, గోలి విజయలక్ష్మి, పద్మజ, రాజేశ్వరి, లక్ష్మీరాజ్యం, శాంతారెడ్డి, అనిత, ఉష, కుమారి, మంజుల, ఆదిలక్ష్మి, పునీత, పుష్పలత, అరుణ, లక్ష్మీకాంతమ్మ, కస్తూరి, సుశీల పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి


చాంపియన్స్‌గా నిలిచిన ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్స్ క్రికెట్ సభ్యులతో సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్

తిరుపతి ఎడ్యుకేషన్ : చాంపియన్స్‌గా నిలిచిన చిత్తూరు జిల్లా సీనియర్స్ క్రికెట్ జట్టు ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో రాణించాలని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) అధ్యక్షుడు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తిరుపతిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆ జట్టు సభ్యులను విజయ్‌కుమార్ అభినందించారు. జూన్ 28 నుంచి ఈనెల 12వ తేదీ వరకు అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జోన్ డే మ్యాచ్‌లను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్స్ క్రికెట్ జట్టు కడప, కర్నూలు, అనంతపురం జట్లపై విజయం సాధించి చాంపియన్స్‌గా నిలవడం గర్వంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు క్రికెటర్లు కృషి చేయాలని కోరారు.

ఆడబిడ్డకు అన్యాయంపై ఏకమయ్యారు!

- అదనపు కట్నం వేధింపులు
- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన మహిళ


పోలీసు వాహనం ఎదుట పెట్రోల్ పోసుకుంటున్న బాధితురాలు త్రిష ,తల్లి శారద

తిరుపతి రూరల్ : అత్తింటి వేధింపులు తాళలేక ఓ మహిళ తన తల్లితో కలసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలోని మహిళలు అందరూ ఆమెకు అండగా నిలబడ్డారు. బాధితురాలి సమాచారం మేరకు వివరాలు ... తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం హరిజన వాడకు చెందిన రవి, వనజాక్షి కుమారుడు వెంకటేష్‌కు పెనుమూరుకు చెందిన శారద కుమార్తె త్రిషతో 2021లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. అయితే మూడు, నాలుగు నెలలుగా వెంకటేష్ రెండో పెళ్లి చేసుకుంటానని, అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. వివాహ సమయంలో 25 సవర్ల బంగారం, డబ్బుతో పాటు ద్విచక్రవాహనాన్ని కట్నం కింద ఇచ్చినప్పటికీ అదనపు కట్నం కోసం వేధింపులు మొదలు పెట్టారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట కూడా తన పుట్టింటి నుంచి లక్ష రూపాయలు తెచ్చి ఇచ్చినప్పటికీ తనను ఇంటిలోకి రానీయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితురాలు త్రిష కన్నీటి పర్యంతమయింది. ఇటీవల త్రిష తన తండ్రికి ఆరోగ్యం సరిలేదని పుట్టింటికి వెళ్లి వారం రోజుల తరువాత అత్తింటికి తిరిగి రావడంతో అత్తింటి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసుకుని మరో చోటుకి వెళ్లిపోయారు. దీంతో తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దుర్గసముద్రంలోని భర్త వెంకటేష్ ఇంటికి వచ్చి తాళం పగులగొట్టి అందులోనే నివాసం ఉండాలని సూచించి వెళ్లారు. అయితే అప్పటి నుంచి అత్తింటి వారు మరింత ఎక్కువగా వేధింపులకు గురి చేస్తూ భర్త వెంకటేష్ చేరదీయకుండా వదిలేశారని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది. న్యాయం చేయాలంటూ బాధితురాలు త్రిష, తన తల్లి శారదతో కలసి పోలీసు వాహనం ముందు బైఠాయించారు. గ్రామస్తులు ఆమెకు మద్దతుగా నిలబడటంతో పోలీసులు బాధితురాలు త్రిషకు నచ్చజెప్పి ఆత్మహత్య యత్నాన్ని అడ్డుకొని వారించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించడంతో గ్రామంలో పరిస్థితి సద్దుమణిగింది.